
గొలుసుకట్టు.. జలకళ రెట్టింపయ్యేట్టు



వారం రోజులుగా నిత్యం కురుస్తున్న వర్షాలకు ముకురాల కింది చెరువు మత్తడి పోస్తోంది. గతేడాది చుక్కనీరు లేకుండా వట్టిపోయిన చాలా చెరువులు జలకళతో నిండుకుండలా మారాయి. గొలుసుకట్టు చెరువులు పూర్తిస్థాయిలో నిండి దిగువకు ప్రవహిస్తున్నాయి. భూగర్భజలాలు పెరగడంతో రైతులు సంతోషిస్తుండగా మత్స్యకారులకు ఉపాధి కలగనుంది. ముకురాల పై చెరువు నుంచి కిందిచెరువు, వంగూరు మండలం రంగాపూర్ చెరువు నుంచి కోనాపూర్ తుమ్మలసముద్రంలోకి నీళ్లు చేరుతున్నాయి. - న్యూస్‌టుడే, కల్వకుర్తిపట్టణం

పట్టణాల చెంత కాలుష్య కాసారాలు

మురుగుతో కలుషితమవుతున్న చెరువులు, కుంటలు



రాంనగర్ కాలనీ నుంచి చెరువులోకి వెళ్తున్న మురుగు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : పట్టణాల నుంచి వెలువడే మురుగు నేరుగా చెరువులు, కుంటలకు చేరుతోంది. కొన్నేళ్లుగా మురుగు, చెత్తతో నీటి వనరులు కలుషితమవుతున్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలైన నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేటలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఆహ్లాద వాతావరణం దెబ్బతింటోంది. కాలనీల్లోని వ్యర్థాలు ప్లాస్టిక్ వస్తువులు, చెత్త చెదారం నీటి వనరుల్లోకి చేరుతున్నాయి. ఫలితంగా దుర్వాసన, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి.

● నాగర్‌కర్నూల్ పట్టణానికి అనుకుని ఉన్న కేసరి సముద్రం ఈ ప్రాంతంలో పెద్ద చెరువుగా పేరు ఉంది. మినీ ట్యాంక్‌గా మార్చి ఆహ్లాదకరంగా మార్చారు. చెరువులోనే బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేశారు. పట్టణంలోని మురుగు నీరు మొత్తం చెరువులోకి వెళ్తోంది. చెత్తతో పాటు ప్లాస్టిక్ వస్తువులు చేరుతున్నాయి. పట్టణంలో 50 వేల జనాభా ఉండగా మురుగుతో నీటి రంగు మారింది. మురుగు చెరువులోకి వెళ్లకుండా రెండు చోట్ల నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశారు. బస్సు డిపో దాటిన తర్వాత ఒక్కదానిని వినియోగంలోకి తెచ్చారు. మురుగు నీటిని మొత్తం చెరువులోకి వెళ్లకుండా ఈ శుద్ధి కేంద్రాలకు పంపించాలి. కాని అమలు కావడం లేదు.

● ఇటీవల కుమ్మెర పంపుహౌజ్ వరద నీటితో మునిగిపోయింది. టన్నల్‌లో ఉన్న నీటిని బయటికి తోడిపోస్తున్నారు. య్యాలవాడ వద్ద ఆడిట్ టన్నల్ నుంచి తోడిపోసిన నీటిని చెరువులోకి పంపిస్తున్నారు. చెరువు నీటి కలుషితతీవ్రత మరింత పెరిగింది.

● అచ్చంపేట పట్టణంలో రెండు కుంటలు కలుషితమవుతున్నాయి. జూబ్లీనగర్‌లో ఉన్న మల్లమ్మకుంట, వలపట్ల కాలనీ సమీపంలో ఉన్న కొర్లకుంటలకు మురుగునీటిని మళ్లించారు. ఆ నీటితో ఈ కుంటల్లో ఉన్న నీళ్లు పూర్తిగా కలుషితమవుతున్నాయి. కింద ఉన్న వ్యవసాయ దారులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు కుంటలకు చేరి అందులో నుంచి పొలాలకు వస్తున్నాయి. నెల రోజుల క్రితం రైతులు నిరసన వ్యక్తం చేశారు. ● కొల్లాపూర్ పట్టణానికి సమీపంలో ఉన్న నాలుగు కుంటల పరిస్థితి ఇలాగే ఉంది. పట్టణంలో కాలువ వెంట వెళ్లే మురుగునీరు మొత్తం నాలుగు కుంటలకు వెళ్తున్నాయి. వరిదాల చెరువు, కావలోని కుంట, మల్లపురాజు కుంటలోకి మురుగునీరును మళ్లించారు. చుక్కాయిపల్లి చెరువును మినీ ట్యాంక్‌గా చేసేందుకు అప్పట్లో నిధులు మంజూరు చేశారు. ఆ చెరువులోకి కొన్ని కాలనీల మురుగు నీరు వెళ్తోంది.

చెరువులోకి వెళ్లకుండా చర్యలు.. : నాగర్‌కర్నూల్ పట్టణం నుంచి మురుగు నీరు చెరువులోకి వెళ్లకుండా ప్రణాళిక గతంలోనే తయారు చేశారు. భూగర్భ డ్రైనేజీ నీరు నీటి శుద్ధి కేంద్రాలకు వెళ్లే విధంగా పైపు లైను ఉంది. ఒక్క చోట అడ్డంకిగా ఉండటంతో ఇబ్బందిగా మారింది. రామాలయం సమీపంలో పైపులైను పనులు పూర్తి అయితే చెరువులోకి మురుగు నీళ్లు వెళ్లకుండా చేయవచ్చు. ఆ ప్రక్రియ కొనసాగుతోంది. ఆ పనులను పూర్తి చేసి చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం. - నరేశ్‌కుమార్, పుర కమిషనర్, నాగర్‌కర్నూల్

పాలమూరులోనే అత్యధిక వర్షపాతం

భూగర్భ జలాలు మెరుగు పడ్డా పెరగని సాగు

ఈనాడు, మహబూబ్‌నగర్: ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన మొదటి ఐదు జిల్లాలు పాలమూరువి చెందినవే. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మాత్రమే అధిక వర్షాలు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం సగటున 452.56 మి.మీటర్లు ఉండగా ఇప్పటి వరకు 852.34 మి.మీటర్లు నమోదయ్యింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో సాధారణం, ఓ మోస్తరు వర్షపాతంతో నమోదవ్వగా అధిక వర్షపాతంతో ఇక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. ఒక్క నెలలోనే మహబూబ్‌నగర్‌లో 1.52 మీటర్లు, నాగర్‌కర్నూల్-0.97, నారాయణపేట-1.55, వనపర్తి-2.50, జోగులాంబ గద్వాల-2.48 మీటర్ల మేర భూగర్భ జలాలు పైకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైనా సాగు విస్తీర్ణం పెరగలేదు. రాష్ట్రంలోనే సాధారణ విస్తీర్ణంలో తక్కువ సాగైన జిల్లాల్లో మొదటి స్థానంలో నాగర్‌కర్నూల్ ఉంది. ఈ జిల్లాలో 77.65 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. గద్వాల జిల్లాలో 87.64 శాతం పంటలే సాగయ్యాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లోనూ పూర్తిస్థాయిలో సాగు చేపట్టలేదు. వ్యవసాయ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో ఈ వివరాలను వెల్లడించారు.



దేవరకద్రలో సాగవుతున్న వరి

పంటలు ఇలా.. (ఎకరాల్లో)

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగైంది
మహబూబ్‌నగర్	3,34,159	3,25,626
జోగులాంబ గద్వాల	3,37,011	2,95,340
వనపర్తి	2,40,233	2,29,588
నాగర్‌కర్నూల్	5,26,606	4,08,917
నారాయణపేట	4,27,260	4,22,585

ఈ వానాకాలం సీజన్‌లో నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)

జిల్లా	సాధారణం	నమోదైంది
మహబూబ్‌నగర్	472.8	891.8
గద్వాల	413.6	746.7
వనపర్తి	646.1	915.7
నాగర్‌కర్నూల్	450.3	794.3
నారాయణపేట	461.0	913.2

90.17 శాతమే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 18.65 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 16.82 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. సాధారణ సాగులో 90.17 శాతం మాత్రమే సాగయ్యింది. ఇందులో వరి 7.64 లక్షల ఎకరాల్లో సాగయ్యింది. పత్తి-6 లక్షలు, కంది-1.30 లక్షలు, జొన్న-30 వేలు, మొక్కజొన్న-80 వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం కొంత వరకు తగ్గింది. ప్రధానంగా నాగర్‌కర్నూల్, గద్వాలలో సాగు విస్తీర్ణం తగ్గడంతో ఉమ్మడి జిల్లాలో సాధారణ సాగుపై ప్రభావం చూపుతోంది. ఈ రెండు జిల్లాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. ఈసారి పత్తి సాగు తగ్గింది. భారీ వర్షాలతో ఈ పంటకు తెగుళ్లు రావడం, సీజన్ ప్రారంభంలో అనుకున్న స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటల సాగుపై ప్రభావం పడింది.



పంట ఆరబోశారు.. జారితే ఏం చేస్తారు?

నేటి చిత్రం

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఇప్పుడిప్పుడే చేతికి అందివస్తున్నాయి. కోత కోసిన పంటను ఆరబెట్టుకొని దానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ వైపు వర్షాలు పడుతుండటంతో చేతికొచ్చిన పంట పాడవుతుందోనని ఎక్కడ ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసీ రహదారులపైనే పంటను ఆరబోసుకుంటున్నారు. జడ్చర్ల మండలం కొత్తతండాలో రైతులు జొన్న పంటను జాతీయ రహదారి-167పై ఆరబోసుకున్న వైనాన్ని 'ఈనాడు' క్లిక్‌మనిపించింది. -ఈనాడు, మహబూబ్‌నగర్

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు తప్పనిసరి

కందనూలు, న్యూస్‌టుడే : నేరాలకు పాల్పడిన నేరస్థులను త్వరగా గుర్తించడానికి పోలీసు సిబ్బంది కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. పట్టణంలోని పరేడ్ మైదానంలో శుక్రవారం డాగ్‌స్క్వాడ్‌తో డ్యూటీ మీట్ 2024 నిర్వహించగా ఎస్పీ పరిశీలించారు. డ్యూటీమీట్‌లను జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహిస్తారని వివరించారు. జిల్లాలోని పోలీసు సిబ్బంది అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, ఏఆర్ డీఎస్పీ భరత్, డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆనందమానందమాయె!

- 2008 డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల
- ఉమ్మడి జిల్లాలో 361 మందికి అవకాశం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో నివసిస్తున్నారు. భర్త ఓ ప్రైవేట్ ఉద్యోగి. 2008 డీఎస్సీలో 56.5 శాతం మార్కులు పొంది 2,791వ ర్యాంకు సాధించారు. కానీ అప్పుడు ఉద్యోగం రాలేదు. దీంతో రెసిడెన్షియల్ పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తుంటే అక్కడ రెగ్యూలర్ ఉపాధ్యాయులు రావడంతో ఇంటికే పరిమితమయ్యారు. ప్రస్తుతం ఆమె వయస్సు 53 ఏళ్లు. రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. - ఉమ



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నివసిస్తున్నారు. 2008 డీఎస్సీలో 58.5 మార్కులు పొంది 2,294వ ర్యాంకు సాధించారు. 59 మార్కుల వద్ద అప్పుడు కటాఫ్ నిర్ణయించడంతో ఉద్యోగం రాలేదు. అనంతరం పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేశారు. ప్రభుత్వం 2008 డీఎస్సీ అభ్యర్థులకు తాత్కాలిక ఉపాధ్యాయులుగా తీసుకుంటామని ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - నరేశ్

పాలమూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 2008 డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు 361 మంది ఉన్నారు. వారందరికి ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ఉపాధ్యాయులుగా నియమించడానికి రేవంత్ సర్కార్ అనుమతించడంతో సంబంధించిన విద్యార్హతల పరిశీలన శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో డీఈవో కార్యాలయంలో అభ్యర్థుల ధ్రువపత్రాలను విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పరిశీలిస్తున్నారు. విశేషమేంటంటే 361 మందిలో అనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే వయస్సు గడువు తీరిపోయింది. వారంతా ఆయా పనులు చేసుకుంటూ ప్రస్తుతం ఉపాధిని పొందుతున్నారు. పలువురు డీఎస్సీతో రాకపోవడంతో ఇతర ఉద్యోగ ప్రకటనలకు దరఖాస్తులు చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. కానిస్టేబుళ్లు, పంచాయతీ కార్యదర్శులు, గురుకులాలు, కేజీబీవీలు, గ్రూప్స్ పోటీ పరీక్షలు రాసి విజయం సాధించారు. ఈ 2008 డీఎస్సీ అర్హత జాబితాలో దాదాపు 100 కంటే ఎక్కువగానే ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని పలువురు అభ్యర్థులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తొలిరోజు 82 మంది అభ్యర్థులు హాజరు...: జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువ పత్రాలను పరిశీలించే కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఇచ్చారు. తొలిరోజు కేవలం 82 మంది మాత్రమే పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. డీఈవో కార్యాలయంలో అధికారులు 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి అభ్యర్థులు తరలి వచ్చారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తరువాత అభ్యర్థుల వివరాలను రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులకు జాబితాను సమర్పించనున్నారు. అనంతరం వారిని ఆయా ఖాళీగా ఉన్న స్థానాల్లో తాత్కాలిక పద్ధతిపై నియమించనున్నారు.



అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఈవో కార్యాలయ అధికారులు

అనుమతులు వచ్చిన తర్వాత నియామక పత్రాలు ఇస్తాం.. : అభ్యర్థులకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే రానున్నాయి. వేతనం, సర్వీస్, ఇతర అంశాలన్నింటిపై కొద్దిరోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలిన అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం. అక్కడ నుంచి అనుమతులు వచ్చిన తర్వాత నియామక పత్రాలను అందజేస్తాం. - రవీందర్, డీఈవో

సమష్టి కృషితోనే మాదక ద్రవ్యాల నియంత్రణ

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, రవాణా తదితర అంశాలపై ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కసారి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవనశైలి మారిపోయి ఇబ్బందులోకి వెళ్తారన్నారు. బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తారన్నారు. అల్కహాల్, గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయన్నారు. వాటికి యువత దూరంగా ఉండేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు, యువత ఉన్నత లక్ష్యంతో వెళ్తున్న క్రమంలో ఏ మాత్రం తప్పుదారిలో వెళ్లినా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్తుపదార్థాల నియంత్రణకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. పోలీస్ యంత్రాంగం మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగంలో లేవన్నారు. గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఆబ్కారి శాఖ అధికారి గాయత్రి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడిన తొలి తరం నాయకుల్లో కొండా లక్ష్మణ్ చిరస్మరణీయుడన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఉద్యాన యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో పుర ఛైర్మన్ కల్పన, జిల్లా అధికారులు చిన్న ఓబులేషు, పద్మశాలి సంఘం నాయకులు వెంకటస్వామి, నిరంజన్, కుమారస్వామి, రామకృష్ణ, శేఖర్, గంగాదర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు, నాయకులు

నీటిపారుదల నిర్వహణ ఇక మెరుగు!

క్షేత్ర స్థాయి సిబ్బంది నియామకానికి పచ్చజెండా



రామన్‌పాడ్ జలాశయం కింద దేవర్‌పల్లి శివారులో అధ్వానంగా కుడి కాలువ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : నీటి పారుదల నిర్వహణలో కీలకంగా ఉండే లస్కర్లు, సహాయకుల నియామకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన ప్రకటన అన్నదాతల్లో ఆనందం నింపింది. వీరి నియామకంతో సాగునీటి జలాశయాలు, చెరువులు, కుంటల ఆయకట్టు కింద నీటి పారుదల నిర్వహణ మెరుగుపడనుంది. గురువారం రాష్ట్ర స్థాయిలో జరిగిన సాగునీటి సమీక్ష సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ప్రకటన వెలువడటంతో ఆయా జలాశయాల కింద పొలాలు, స్థిరాస్తి నష్టపోయిన బాధిత కుటుంబాలు, నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

● ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల, కోయిలసాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి సాగునీటి పథకాల కింద లస్కర్లు, సహాయకుల నియామకాలు ఏళ్ల తరబడిగా చేపట్టలేదు. జూరాల జలాశయం నిర్మాణ పనుల్లో పాల్గొన్న మ్యాన్ మజ్దూర్లలో చాలా మంది పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో జీవో నెం.45 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 3,293 మంది లస్కర్లకు కేవలం 419 మంది, 728 మంది సహాయకులకు 196 మంది ఉన్నారని జులై 2016లో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ప్రభుతానికి నివేదించారు. ● కొత్తగా లస్కర్లు, సహాయకుల ఖాళీలను భర్తీ చేయాలని 10 జూన్ 2021న ప్రతిపాదనలు పంపారు. గత ఏడాది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూశాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులను ఆయా రాష్ట్ర ప్రభుత్వ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో ఆయా నీటిపారుదల శాఖ సీఈ కార్యాలయాల పరిధిలో లస్కర్లు, సహాయకులను నియమించారు. ● నారాయణపేట డివిజన్‌కు 23 మందిని, వనపర్తి డివిజన్‌కు 124 మంది నియమించారు. అయినప్పటికీ లస్కర్లు, సహాయకుల కొరత తప్పడం లేదు. యాసంగిలో సాగునీటి పారుదలను నియంత్రించే సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు సమస్య ఏర్పడుతోంది.

మార్గదర్శకాలు ఇవీ..

● ప్రభుత్వం 22 జులై 2016న నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ. ఒకరు, ఉప కాలువ కింద ప్రతి 112 కి.మీ. ఒకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు ఒకరు చొప్పున లస్కర్లు విధులు నిర్వర్తించాలి.

● ప్రధాన కాలువపై ప్రతి ఐదు మంది లస్కర్లను ఒకరు, ఉపకాలువల కింద ప్రతి ఆరు మంది లస్కర్లపై ఒకరు చొప్పున సహాయకులను నియమించాల్సి ఉంటుంది. వీరి కొరత వల్ల ఈ మార్గదర్శకాలు అమలు కావడం లేదు.

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన నేపథ్యంలో కొత్తగా 281 మంది సహాయకులు, 1,597 మంది లస్కర్లను నియమించేందుకు చర్యలు తీసుకోనున్నారని నీటిపారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు.

ఆదేశాలకనుగుణంగా చర్యలు : కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తాం. - శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ, పెబ్బేర్ డివిజన్

అన్ని కులాల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. మహబూబ్‌నగర్ ఈనాడు ప్రాంతీయ కార్యాలయం H.No.: 1-6-65/3, తెలంగాణ చౌరస్తా, సుభాష్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు సంబంధిత కుటుంబీకులు నేడు (28 సెప్టెంబరు 2024, శనివారం) రేపు (29 సెప్టెంబరు 2024, ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91543 40820 & 91549 92572 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలి

మంత్రి జూపల్లి



అధిక సంఖ్యలో యువ క్లబ్‌లు ఏర్పాటు చేసినందుకు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయికి అవార్డు అందజేస్తున్న మంత్రి జూపల్లి, చిత్రంలో రమేష్‌రెడ్డి, వాణీ ప్రసాద్

మాదాపూర్, న్యూస్‌టుడే: జీవిత మున్నది ఒక్కటే.. దాన్ని సాకారం చేసుకోవాలి.. నిత్యం కుటుంబం, సంపాదనలో మునిగిపోకుండా కనీసం నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలను చూసి ప్రశాంతంగా గడపాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. పర్యాటక ప్రదేశాల సందర్శనతో మనసుకు ఆనందం, ఆహ్లాదంతో పాటు ఆలోచన విధానంలో మార్పు వస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నితమ్)లో ప్రపంచ పర్యాటక దినోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. పురాతన కట్టడాలు, కోటలు, దేవాలయాలు ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలున్న మన దేశంతోపాటు తెలుగు రాష్ట్రాలు పర్యాటకపరంగా ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. చాలా మంది తమ నిత్యజీవిత పనుల్లో నిమగ్నమై ఏడాదికి ఒకసారి కూడా పర్యాటక ప్రదేశాలకు వెళ్లడం లేదన్నారు. నెలలో ఒక రోజు పర్యాటకానికి కేటాయించుకోవాలని చెప్పారు. తాను మంత్రి అయిన తర్వాతే గోల్కొండ కోటను చూశానన్నారు. యూనెస్కో గుర్తించిన రామప్ప లాంటి ఎన్నో కట్టడాలు, కళాఖండాలు, శిల్పసంపద తెలంగాణలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

వసతుల మెరుగుదలకు చర్యలు..

మూసీ రివర్ ఫ్రంట్‌ను అద్భుతంగా తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తుందని చెప్పారు. పర్యాటక ప్రదేశాల్లో వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ దర్శిని పేరిట విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలు వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సముద్రం, ఇసుక తప్ప ఏమీ లేని దేశాలకు వెళ్లి రూ.లక్షలు ఖర్చుచేయడం కాదు అద్భుతమైన కళాఖండాలు, చారిత్రక కట్టడాలు, కళల సంపద ఉన్న మన దేశంతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్‌లు తెలంగాణ పర్యాటకరంగానికి రాయబారులుగా వ్యవహరించాలన్నారు.

● అనంతరం రాష్ట్రంలో అత్యధిక యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసినందుకుగాను వరంగల్ కలెక్టర్ సత్యశారదా, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్‌లకు పర్యాటక శాఖ తరఫున మంత్రి జూపల్లి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు, కళాకారులు చూడముచ్చటైన కళారూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, ఇక్కడి పర్యాటక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను చాటుతూ అద్భుతమైన నృత్యప్రదర్శనలతో అందరినీ అలరించారు. ఉర్రూతలూగించే జానపద కళలతో చూపరులను కట్టిపడేశారు.

ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టుతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ క్రీడాకారులకు మంచి వేదిక అని దీనిని సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయికి ఎదగాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎండీసీఏ మైదానంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్ర స్థాయి టోర్నీకి బయలుదేరిన ఉమ్మడి జిల్లా అండర్-19 జట్టును అభినందించారు. టోర్నీలో ప్రతిభ కనబరిస్తే కంబైన్డ్ జిల్లాల జట్టుకు ప్రాతినిధ్యం దక్కనుందన్నారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, సంఘం సభ్యులు గోపాలకృష్ణ, అబ్దుల్లా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్-19 టోర్నీ..: హన్మకొండలో శనివారం నుంచి అండర్-19 అంతర్ జిల్లాల టోర్నీ ప్రారంభం కానుంది. పూల్ 'ఎ'లో మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, నల్గొండ జట్లు.. పూల్ 'బి'లో నిజామాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ జట్లున్నాయి. ఉమ్మడి జిల్లా జట్టులో.. అబ్దుల్ రాఫె, ఇ.అభిలాశ్ గౌడ్, జి.శశాంక్, ఎం.సాత్విక్ రెడ్డి, ఎండీ ముఖీత్, డి.అభినవ్, జి.చరణ్ తేజ్, ఎస్.అభినయ్ తేజ, షాదాబ్ అహ్మద్, డి.రాజు, కె.మనోజ్, బి.కనిష్క్, రాంచరణ్, ఎం.అర్జున్ రెడ్డి, అంకిత్ రెడ్డి, జి.వివేక్, ఎ.నరేశ్, కె.హరినాథ్ ఎంపికయ్యారు. శనివారం తొలి మ్యాచ్‌లో జిల్లా జట్టు ఆదిత్య వరంగల్ జట్టుతో తలపడనుంది.

చేతిలో శత్రువు



● ఎలాంటి చెడు అలవాట్లు లేని 36 ఏళ్ల వ్యక్తి క్యాన్సర్ బారిన పడి చనిపోయాడు. మద్యం, గుట్కా, పాన్‌మసాలా, సిగరెట్ వంటివి ఏనాడూ తీసుకోకున్నా క్యాన్సర్ మహమ్మారి అతని ప్రాణాలను తీసింది. వైద్యులు ఆయన శరీరాన్ని పరిశోధించగా ప్లాస్టిక్ కవర్లలో తెచ్చిన వేడి ఆహారాన్ని తినడం, ప్లాస్టిక్ సీసాలో నీటిని తాగడం వల్ల అందులోని రసాయనాలతో క్యాన్సర్ బారిన పడినట్లు తేల్చారు. ప్లాస్టిక్ బ్యాగుల్లో తెచ్చిన వేడివేడి టీ ఆరుసార్లు తాగేవాడు. ప్లాస్టిక్ సీసాలు, బాక్సుల్లో వేడి ఆహారాన్ని, నీటిని ఉంచి తాగొద్దని హైదరాబాద్‌కు ప్రముఖ వైద్యుడు డా.నాగేశ్వర్‌రెడ్డి ఈ విషయాన్ని తెలియజేశారు.

● పంజాబ్‌లో మరణించిన ఆవుకు శవపరీక్ష చేయగా కడుపులోంచి 26 కిలోల ప్లాస్టిక్ సంచులు బయటపడ్డాయి. మనుషులు ప్లాస్టిక్ కవర్లలో ఆహారాన్ని పారవేయగా, ఆవు ఆ ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లతో సహా తినేసింది. ఆ ప్లాస్టిక్ కవర్లు జీర్ణం కాలేక కడుపులో అలాగే ఉండిపోయి చివరకు దాని ప్రాణం తీశాయి.

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్లాస్టిక్‌ను నిషేధించామని అధికారులు చెబుతున్నా, అడపాదడపా దాడులు చేస్తున్నా ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం తగ్గడం లేదు.

న్యూస్‌టుడే, కోస్గి

ప్లాస్టిక్ లేకపోతే జీవితమే లేదు.. అన్నట్లుగా తయారయ్యింది ఉమ్మడి జిల్లాలో పరిస్థితి. చిన్న వస్తువు కొన్నా ప్లాస్టిక్ కవర్‌లో తీసుకువెళ్తున్నారు. బజారుకు వచ్చి పది వస్తువులు కొంటే వాటిని వేసుకునేందుకు నాలుగైదు కవర్లను ఆయా దుకాణదారుల నుంచి తీసుకుంటున్నారు. పిల్లలకు పాలు తాగించడానికి ప్లాస్టిక్ బాటిళ్లను ఉపయోగిస్తున్నారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై, ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) బాటిళ్లపైన నిషేధం ఉంది. దుకాణాలపై దాడులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

మన దగ్గర వ్యర్థాల పోగులు : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 19 పురపాలక సంఘాల్లో రోజూ 310 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పోగవుతుండగా, అందులో 108.9 మెట్రిక్ టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.. కలెక్టర్‌గా వెంకట్రావు ఉన్న సమయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తిలో శ్వేతా మహంతి కలెక్టర్‌గా ఉన్న సమయంలో ప్రతి బుధవారం ప్లాస్టిక్ వినియోగం, నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో మంచి ఫలితాలు రాగా ఆ తర్వాత అలాంటి కార్యక్రమాలు లేకుండా పోయాయి.



తిరుమల ఆదర్శం

కఠినంగా వ్యవహరించకుంటే విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి నిత్యం లక్షలాది భక్తులు తరలి వస్తారు. ఇక్కడ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించారు. కొండపైకి వెళ్లేటప్పుడు అలిపిరి వద్ద తనిఖీలు చేపడతారు. ప్లాస్టిక్ కవర్లు, తీసుకెళ్లనీయరు. మన పురపాలికలు ఇలా చేస్తే మేలు.



నిషేధ వస్తువులు ఇవే..

కేంద్ర ప్రభుత్వం 16 రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. ఇందులో ఇయర్ బడ్స్, బెలూన్లు, క్యాండి, ఇస్క్రీం కోసం వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్లలోపు ఉండే పీవీసీ బ్యానర్లు, అలంకరణ కోసం వాడే థర్మాకోల్.

మార్పు మన నుంచే..

● మార్పు మన నుంచే మొదలవ్వాలి. నారాయణపేట జిల్లా ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా గుడ్డ సంచీలు తయారు చేసి తమతోపాటు తమ ఇళ్లల్లో వినియోగించేలా చూస్తున్నారు.

● నెలల తరబడి ఒకే టూత్ బ్రష్ వాడటం వల్ల ప్లాస్టిక్ రేణువులు శరీరంలోకి వెళతాయి. బ్రష్‌లు మార్చుకోవాలి. వీలైన వాళ్లు వేప, కాగు పుల్లలతో పళ్లు తోమడం అన్ని విధాలా మంచిది.

● పాఠ్యపుస్తకాల అట్టలకు ప్లాస్టిక్ పేపర్లు వాడే బదులు దినపత్రికలను, కాగితం కవర్లుగా వేయడం మంచిది. చిన్నారులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగించవచ్చు. బ్యానర్లు, ఫ్లెక్సీలకు బదులుగా వస్త్రాల బ్యానర్లు వాడటం మంచిది.



బాధ్యత మనదే..

● నిత్యావసర సరకులు, కూరగాయలు తెచ్చేందుకు విధిగా గుడ్డ సంచులు తీసుకువెళ్లాలి. ● మాంసం తెచ్చుకోడానికి స్టీల్ డబ్బాలను పట్టుకెళ్లడం మంచిది. బయట ప్రయాణించేటప్పుడు స్టీల్, రాగి సీసాలు ఉపయోగించాలి. ● టీ, పండ్ల రసాలు, పానీయాలు తాగేటప్పుడు గాజు, కాగితపు గ్లాసులను వినియోగించాలి. ● శుద్ధి చేసిన నీటిని డబ్బాలలో తీసుకోవడంకన్నా ఇంట్లోనే నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం. ● పాత జీన్ ప్యాంట్లను బస్తాలుగా కుట్టుకుంటే చాన్నాళ్లు మన్నికగా ఉంటాయి. వాటిపై అందమైన అల్లికలు చేయవచ్చు. ● ఏవైనా కార్యక్రమాలు జరిగేటప్పుడు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉపయోగించాలి. కాగితంతో చేసినవైనా మేలే. ● అరటి, మోదుగ వంటి ఆకులతో చేసిన విస్తర్లలో భోజనం చేయడం అత్యుత్తమం. ● హోటల్ నుంచి పార్శిల్ తెచ్చుకునేటప్పుడు మనమే డబ్బాలను పట్టుకెళ్తే మంచిది. ● ఇప్పుడిప్పుడే మట్టిపాత్రలు, వస్తువుల ఉపయోగం పెరగడం ఆదర్శనీయం. ఇది మరింత విస్తరించాలి.





ముశ్రీఫా జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా వస్త్రంతో తయారు చేసిన సంచులు

మీకు తెలుసా?

● ప్రతి మనిషి నిత్యం సగటున 25 నుంచి 50 గ్రాముల ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి.

● ప్లాస్టిక్ రేణువులు శరీరంలో చేరి పేగుల్లో క్యాన్సర్‌కు కారణమవుతుంది. మెదడులో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి.

భూమాతకు ఎంత కష్టం



వస్తువు మట్టిలో కలిసేందుకు పట్టే సమయం

కూరగాయలు : 5 రోజుల నుంచి నెల **అరటి తొక్క :** 24 రోజులు **చెరకు పిప్పి :** 30- 60 రోజులు **కాగితం :** 20 రోజుల నుంచి అయిదు నెలలు **ఆకులు :** సంవత్సరం **సిగరెట్ పీక :** ఏడాది నుంచి పన్నెండేళ్లు **తోలు వస్తువులు :** 25 నుంచి 45 ఏళ్లు **నైలాన్ :** 30 - 40 సంవత్సరాలు **అల్యూమినియం వస్తువులు :** 80 ఏళ్లు **పాలిథిన్ కవర్లు :** 400 - వెయ్యి సంవత్సరాలు

రంగులతో ప్రమాదం



కవర్లకు కలిపే రసాయన రంగుల్లో ఆరోగ్యానికి హాని చేసే కాడ్మియం, సీసం వంటివి ఉన్నాయి. ఇవి నేలలో కరిగిపోవు. భూసారాన్ని కూడా నాశనం చేస్తాయి. ప్రతి ఏటా రెండు మిలియన్ల పక్షులు, సముద్రజీవులు ప్లాస్టిక్ కారణంగా చనిపోతున్నాయి. ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నిషేధించాలి.

- వార్ల మల్లేశం, జాతీయ హరిత దళ సమన్వయకర్త

రేణువులు అవయవాలలో చేరుతున్నాయి



ప్లాస్టిక్ నానో రేణువులు తెలియకుండానే శరీరంలోని అన్ని అవయవాల్లోకి చేరుతున్నాయి. ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే బయటకు రావు. కణ వ్యవస్థను దెబ్బ తీస్తాయి. మనం తాగే శుద్ధ జలంలోనూ నానో ప్లాస్టిక్ రేణువులు ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. చిన్నపిల్లలు ఐస్క్రీంలు, బేకరీ ఉత్పత్తులు తినేటప్పుడు నానో రేణువులు వెళ్లే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వస్తువుల్లో తినడం, తాగడానికి దూరంగా ఉండాలి.

- డా. శివకుమార్ సింగ్, సహాయ ఆచార్యులు, పాలమూరు విశ్వవిద్యాలయం

కానిస్టేబుల్‌పై ఎస్సైకి ఫిర్యాదు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : బాధితుడికి సహకారం అందిస్తానని కానిస్టేబుల్ డబ్బులు వసూలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. గంగారం గ్రామానికి చెందిన యువకుడు సురేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. గురువారం గ్రామానికి రాగా యువతి తల్లిదండ్రులు యువకుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సురేశ్ డయల్ 100కి సమాచారం ఇచ్చారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ వచ్చి మీకు సహాయం చేస్తానని సురేశ్ నుంచి రూ.2వేలు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న సురేశ్ తాత వెంకటయ్య శుక్రవారం లిఖిత పూర్వకంగా ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఘటనపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

కల్లు దుకాణాలపై నార్కోటిక్, పోలీసుల దాడులు


పలువురు నుంచి నమూనాల సేకరణ

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారీ చేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు రాష్ట్ర నార్కోటిక్ అధికార బృందం గద్వాల పోలీసుల ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గంలోని పలు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.... గద్వాల మండలంలోని జమ్మిచేడు, వీరాపురం, పూడూరు, మేలచెర్వు, మల్దకల్ మండలంలోని మద్దెలబండ, ధరూర్ మండలంలోని మరో రెండు గ్రామాల్లో కల్లు తాగుతున్న సుమారు 20 మందికి పైగా అదుపులోకి తీసుకుని వారి నుంచి నమూనాలు సేకరించారు. అధికారులు తమ వద్ద కొన్ని ఎక్విప్‌మెంట్ ద్వారా మూత్రం ద్వారా పరీక్షలు నిర్వహించగా కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించినట్లు పాజిటివ్ ఫలితాలు తేలినట్లు సమాచారం. ఇంకా పూర్తి స్థాయి నిర్ధారణకు జిల్లా ప్రభుత్వాసుపత్రికి గద్వాల గ్రామీణ పోలీసులు కల్లు తాగిన వారిని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. గద్వాల నియోజకవర్గంలో కొందరు కల్లు నిర్వాహకులు మత్తుపదార్థాలను వినియోగించి కల్లును విక్రయిస్తున్నారని కొందరు రాష్ట్ర ఆబ్కారీ, నార్కోటిక్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, మరి కొందరు కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు కల్తీ కల్లును అరికట్టేందుకు నార్కోటిక్ అధికారులు నాలుగు బృందాలుగా విడిపోయి దాడులు చేసినట్టు సమాచారం. కల్లులో మత్తు పదార్థాలు కలిపి తయారు చేసి విక్రయిస్తున్న కొందరి నిర్వాహకులపై సంబంధిత ఠాణాల్లో కేసు నమోదైనట్టు సమాచారం. దాడుల వివరాలు చెప్పేందుకు నార్కోటిక్ అధికారులు, గద్వాల పోలీసులు నిరాకరించారు. తాము సేకరించిన నమూనాల ఫలితాలను ప్రధాన కార్యాలయానికి నివేదిస్తామని నార్కోటిక్ అధికారులు చెప్పారు. అయితే ఇటీవల కల్లు దుకాణాలపై నార్కోటిక్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి పలువురి నిర్వాహకులపై కేసులు నమోదు చేయగా, శుక్రవారం మరోసారి దాడులు నిర్వహించడంతో నిర్వాహకులు కొందరు షాక్‌లో పడ్డారు.

ప్రజారోగ్యంతో ఆటలు



పేటలో స్టాంపింగ్ లేకుండానే విక్రయిస్తున్న మాంసం



చనిపోయిన గొర్రెల మాంసాన్ని అంటగట్టారంటూ కొందరు వినియోగదారులు నారాయణపేట మార్కెట్‌లో అమ్మకందారులతో ఇటీవల వాగ్వివాదానికి దిగారు. మాంసం విక్రయాల్లో నాణ్యత ఎంత ఘోరంగా ఉందో ఈ ఘటన అద్దం పడుతుంది. ఉమ్మడి జిల్లాలో మాంసం విక్రయాలను పరిశీలిస్తే అధికారులు దృష్టి సారించాల్సిన అంశాలెన్నో వెలుగు చూస్తున్నాయి.

న్యూస్‌టుడే– నారాయణపేట (పాతబస్టాండ్), మక్తల్ పట్టణం

ఉమ్మడి జిల్లాలో గొర్రె మాంసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఆదివారం వస్తే మటన్ దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతుంటాయి. మాంసాన్ని వండుకోడానికి వీలుగా సిద్ధం చేసే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా అనారోగ్యానికి కారణం అవుతుంది. చాలావరకు విక్రయాల్లో నిబంధనలు పాటించడంలేదు. కొద్దిమంది మాత్రం పరిశుభ్రమైన మాసం అమ్ముతున్నారు. వధించే జీవాల ఆరోగ్యాన్ని ధ్రువీకరించాల్సిన పశువైద్యాధికారులు ఉమ్మడి జిల్లాలో దాదాపు లేరనే చెప్పాలి. జీవాలకు ట్యాగ్ వేసిన తరువాత కోయాలి. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వరకు జంతువులు రోగాలబారిన పడ్డాయి. మరికొన్ని చోట్ల రోడ్డు ప్రమాదాల్లో మేకలు, గొర్రెలు మృతిచెందాయి. అవి మాంసంగా మారి వస్తున్నా పట్టించుకునే నాథుడు లేరు. నగర, పురపాలికల్లోని ప్రజారోగ్య శాఖ అధికారులు కూడా తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

పెద్ద మొత్తంలో అమ్మకాలు

ఒక్కొక్క జిల్లాలో క్వింటాళ్ల కొద్దీ రోజూ మాంసం విక్రయాలు జరుగుతున్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దాదాపు 7 నుంచి 8 వందల జీవాలు వధిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం, పండగ వాటిసంఖ్య ఇంకా ఎక్కువ ఉంటుంది. శాఖాపరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల్లోనూ అవగాహన ఉండాలని పశువైద్యాధికారి అనిరుధ్ అన్నారు. మాంసంలో ఏదైనా తేడా ఉంటే జీవాల చిన్నప్రేగుల్లో ఉండే సుమారు 3వేల రకాల సూక్ష్మజీవుల లార్వాలు అనేక రకాల వ్యాధులను కలిగించే అవకాశం ఉందని వనపర్తి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ మిరాజ్ అహ్మద్ అన్నారు.

నోటీసులు అందజేస్తాం..



రహదారులపైనా, ఆవాసాల మధ్యలో జంతువులను వధిస్తే కఠిన చర్యలు తప్పవు. అపరిశుభ్ర వాతావరణంలో ఇష్టానుసారంగా వ్యవహరించే వ్యాపారస్తులపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఇప్పటికే మాంస విక్రయాలకు పరిశుభ్రత పాటించాలని సూచించాం. ఓసారి పరిశీలించి నోటీసులు ఇస్తాం. పద్ధతి మార్చుకోకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవు.

-సునీత, పుర కమిషనర్, నారాయణపేట.

వధశాలలు ఏవీ?

కబేళాల్లోనే జీవాలు వధించాల్సి ఉన్నా పట్టించుకునేవారు కరవయ్యారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, నారాయణపేట, వనపర్తి, గద్వాలలో మాత్రమే వధశాలలు ఉన్నాయి. 14 మున్సిపాలిటీల్లో లేవు. అక్కడ ఇష్టారాజ్యంగా కోసి అమ్ముతున్నారు. మురుగుకాల్వల పక్కన, అపరిశుభ్ర వాతావరణంలో రోడ్డు పక్కన విక్రయాలు జరుగుతున్నాయి. జీవం కోసేటప్పుడు అది ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యాధికారి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణపత్రం మంజూరు చేయాలి. మాంసాన్ని శుభ్రపరిచాక ఇవ్వాలి. ఇవేవీ అమలు కావడం లేదు. కొన్ని చోట్ల వయసు పైబడిన, మరికొన్ని చోట్ల గొర్రె పిల్లలను నరికి విక్రయిస్తున్నారు.

వ్యర్థాలతో అనర్థం

జీవాలను కోసిన తరువాత వ్యర్థాలను రోడ్లపైకి, నదుల్లోకి, కాలనీల మధ్య పడేస్తున్నారు. దుర్వాసనకు దోమలు, పందులు పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నారాయణపేట, కోస్గి, జడ్చర్ల వంటి ప్రాంతాల్లో ఈ విషయంలో మున్సిపల్ అధికారులకు ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. రహదారులపై దుమ్ము, ధూళి మాంసంపై పడుతోంది. జిల్లాలోని దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో మాంసం వ్యర్థాల కోసం వీధికుక్కలు ఎగబడుతున్నాయి. కాలనీల మధ్యలో వాటి సంచారం మూలంగా పలువురు కాట్లకు గురవుతున్నారు.

నల్లమలలో గుప్త నిధుల తవ్వకాలు!



లక్ష్మాపురం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

అమ్రాబాద్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం లక్ష్మాపురం పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాల కోసం వచ్చిన కొందరిని గ్రామస్థులు పోలీసులకు అప్పగించిన సంఘటన కలకలం రేపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం కొందరు కారులో వచ్చి ప్రాథమిక పాఠశాల ఆవరణలో వాహనాన్ని నిలిపారు. అందులో కొందరు గ్రామ సమీప అడవిలోని నర్సింహస్వామి ఆలయం వైపు వెళ్లగా మరికొందరు గ్రామంలోనే తచ్చాడారు. గ్రామస్థులు అనుమానంతో ప్రశ్నించగా అటవీ అధికారులమని అడవిలో విద్యుత్తు కంచె వేస్తున్నట్లు సమాచారం రావటంతో పరిశీలించేందుకు వచ్చామని బుకాయించారు. రాత్రి 12 గంటలైనా కారు అక్కడే ఉండటంతో గ్రామస్థులు అనుమానంతో రాత్రి 1.30 గంటల సమయంలో అడవిలోకి వెళ్లి పరిశీలించారు. ఎదురు పడిన వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పారు. కొందరు పారిపోగా ఇద్దరిని పట్టుకొని ప్రశ్నిస్తుండగా పోలీసులు వచ్చి గ్రామస్థుల అధీనంలో ఉన్న వారిని, కారును, ద్విచక్రవాహనాన్ని ఠాణాకు తీసుకెళ్లారు. గ్రామస్థులు శుక్రవారం ఉదయం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇదే బృందంలోని కొందరు ఇటీవల కొన్ని ప్రధాన ఆలయాలను పరిశీలించినట్లు సమాచారం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

● గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణ చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవి, మరో వ్యక్తి హరిని విచారించామని కారులో గాని వారి వద్ద గాని ఎలాంటి పరికరాలు లభించలేదన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00


నాగర్‌కర్నూల్‌ : పోలీసు కార్యాలయంలో లక్ష్మణ్‌ బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌ రఘునాథ్‌, పోలీసులు


కొల్లాపూర్‌ : కొండా లక్ష్మణ్‌ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీసీఎస్‌ఎఫ్‌ రాష్ట్ర నేత దాస్‌, విద్యార్థులు

కొండా లక్ష్మణ్‌ నిబద్ధత ఆదర్శనీయం

తెలంగాణ ఆవిర్భావం కోసం పోరాడిన కొండా లక్ష్మణ్‌ బాపూజీ నిబద్ధత యువతకు ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అధికారులు లక్ష్మణ్‌ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. - న్యూస్‌టుడే బృందం


కల్వకుర్తి : పుర కార్యాలయంలో పుర అధ్యక్షుడు సత్యం, సిబ్బంది..


ఊర్కొండ : ఎంపీడీవో కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో కృష్ణయ్య, సిబ్బంది


చారకొండలో..

రుణమాఫీ వివరాల నమోదు అంతంతే..!

ఇప్పటికీ 71.83శాతమే పూర్తి


వెల్దండలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఉప్పునుంతల, బిజినేపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వం మూడు విడతలుగా రైతు రుణమాఫీ చేసింది. వివిధ కారణాలతో జిల్లా వ్యాప్తంగా 23,179 మంది మాఫీ కాపోవడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో ప్రభుత్వం వ్యవసాయాధికారులతో గ్రామాల వారీగా సర్వే చేపట్టింది. జిల్లాలోని 20 మండలాల్లో 16,649 మంది రైతుల వివరాలను అంతర్జాలంలో నమోదు చేశారు. వివిధ కారణాలతో 6,530 మంది రైతులు వివరాలు నమోదు చేయించలేదు.

జిల్లాలో ఇలా.. బిజినేపల్లి మండలంలో అధికంగా 90.54 శాతం నమోదు ప్రక్రియ పూర్తయింది. తర్వాత వంగూరు, చారకొండ మండలాలు ఉన్నాయి. చాలా మంది రైతులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌ వంటి నగరాలకు వెళ్లడంతో అధికారులు ప్రయత్నాలు అందించలేకపోయారు. దసరాకు సొంత గ్రామాలకు వచ్చి దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సమాచారమిస్తున్నాం... జిల్లాలో ఇప్పటి వరకు 71.83శాతం నమోదు ప్రక్రియ పూర్తయింది. మిగిలిన రైతులు త్వరగా వారి వివరాలు అందించాలి. చరవాణి ద్వారా కూడా సమాచారం ఇస్తున్నాం. దీనికి గడువు అంటూ ఏమీ లేదు. - చంద్రశేఖర్‌, జిల్లా వ్యవసాయాధికారి

రుణమాఫీకి అంతర్జాలంలో పేర్ల నమోదు వివరాలు ఇలా..

మండలం	మొత్తం రైతులు	నమోదు చేసుకున్న వారు	పెండింగ్‌లో ఉన్నవారు
బిజినేపల్లి	1,089	986	103
వంగూర్	2,301	1,986	315
చారకొండ	924	794	130
పెంట్లవెల్లి	268	217	51
తిమ్మాజిపేట	1,458	1,167	291
ఉప్పునుంతల	1,162	930	232
బల్మూర్	1,228	907	321
అమ్రాబాద్	599	435	164
పదర	393	283	110
ఊర్కొండ	1,449	1,023	426
అచ్చంపేట	1,727	1,218	509
తాడూర్	921	647	274
తెల్కపల్లి	1,350	907	443
కల్వకుర్తి	2,560	1,699	861
కోడేరు	728	480	248
లింగాల	649	426	223
పెద్దకొత్తపల్లి	1,074	652	422
వెల్దండ	1,210	711	499
నాగర్‌కర్నూల్	1,174	687	487
కొల్లాపూర్	915	494	421

క్రీడాకారులను ప్రోత్సహించాలి

అచ్చంపేట న్యూటౌన్‌, న్యూస్‌టుడే : గ్రామీణ స్థాయి క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని సాయినగర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్‌స్థాయి క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంబేడ్కర్‌ ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. నడింపల్లి రైతువేదికలో నీటి సరఫరా సహాయకుల శిక్షణలో పాల్గొన్నారు. కాలనీలోని ఉన్నత పాఠశాలలో అదనపు గదులు, మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. నిరుద్యోగులు వైద్యులుగా మెరుగు పర్చేందుకు అంబేడ్కర్‌ పేరుతో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పుర అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంఈవో జీవన్‌ కుమార్‌, జిల్లా అంగన్‌వాడీ అధికారిణి రాజేశ్వరి, సీడీపీవో దమయంతి, డీఈ హేమలత, ఏఈ బాలరాజు, గోపాల్‌రెడ్డి, మల్లేష్‌, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం

వంగూరు, న్యూస్‌టుడే : పార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. వంగూరులో కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దసరా నాటికి మండలంలోని అన్ని గ్రామాలకు తారు రహదారులు, అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా ఇస్తామని చెప్పారు. సమావేశంలో బీసీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వంకేశ్వరం, నాయకులు అల్వాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పాండురంగారెడ్డి, రమేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం

అచ్చంపేట టౌన్‌, న్యూస్‌టుడే : జాతీయ లోక్‌ అదాలత్‌ ద్వారా కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్వరి అన్నారు. శుక్రవారం అచ్చంపేట జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టును సందర్శించి, సమస్యలపై చర్చించారు. కోర్టు ప్రాంగణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. బాలసదనం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్‌ సివిల్‌ జడ్జి విజయ్‌ కుమార్‌, అచ్చంపేట బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రాజేందర్‌, కార్యదర్శి కాసర్ల, సీనియర్‌ న్యాయవాదులు బాన్యారెడ్డి, సత్యయ్య, వెంకటశెట్టి, మస్తాన్‌, వెంకటరమణ, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి సబిత

తెలకపల్లి, న్యూస్‌టుడే : మార్కెట్‌లో రైతులు ఎప్పుడైనా ఎలాంటి మోసాలకు గురికాకుండా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో వాటిపై ఐఎస్‌ఐ ముద్ర ఉంటేనే కొనుగోలు చేయాలని నాగర్‌కర్నూల్‌ జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.సబిత అన్నారు. తాళ్లపల్లి గ్రామంలో శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు సందర్భంగా తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు గుర్తిస్తే నష్ట పరిహారం కోసం జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు వేయొచ్చన్నారు. ఎస్సై నరేశ్‌, న్యాయవాదులు అంబేడ్కర్‌గౌడ్‌, ఎం.మధుసూదన్‌రావు, శ్యాంప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

నాగర్‌కర్నూల్‌ : 7993300530 కల్వకుర్తి : 9908803650
అచ్చంపేట : 8008573927 కొల్లాపూర్‌ : 8008573869

స్విచ్చులు లేక అవస్థలు

సమస్య : పట్టణంలోని 20 వార్డుల్లో విద్యుత్తు స్తంభాలకు బిగించిన ఎల్‌ఈడీ వీధి దీపాలకు ఆన్‌ఆఫ్‌ స్విచ్చులు లేకపోవడంతో పట్టపగలే వెలుగుతున్నాయి. - నరేందర్‌, నాగర్‌కర్నూల్‌

సమాధానం : పురపాలక సిబ్బందితో ఆన్‌ఆఫ్‌ స్విచ్చులు ఏర్పాటు చేస్తాం. విద్యుత్తు వృథా నివారిస్తాం. - నరేశ్‌బాబు, పురపాలక సంఘం కమిషనర్‌, నాగర్‌కర్నూల్‌

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : దేవర
కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర, నేషనల్‌ : దేవర

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు: టమాటా 26, వంకాయ 40, బెండ 40, మిరప 40, కాకర 60, బీర 60, క్యాలీఫ్లవర్ 64, క్యాబేజీ 42, క్యారెట్ 64, దొండ 48, ఆలుగడ్డ 45, ఉల్లిగడ్డ 52, గోకర 64, దోస 40, ఆనంకాయ 16, చిక్కుడు 64, మునగకాయ 64, బీట్‌రూట్ 50, ఖీర, 40, బీన్స్ 85.

గ్రామస్థులకే ఛైర్మన్‌ పదవి ఇవ్వాలి


ఆలయం ఎదుట దీక్ష చేస్తున్న ఊర్కొండపేట గ్రామస్థులు

ఊర్కొండ, న్యూస్‌టుడే : గ్రామస్థులకే ఆలయ ఛైర్మన్‌ పదవి ఇవ్వాలంటూ ఊర్కొండపేట గ్రామస్థులు దీక్షలు చేపట్టారు. శుక్రవారం మండలంలోని ఊర్కొండపేట ఆంజనేయస్వామి దేవాలయ పాలక మండలి ఏర్పాటు చేయనున్నారన్న సమాచారం తెలియడంతో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామస్థులను విస్మరించి వేరే గ్రామాలకు చెందిన నాయకులకు ఆలయ ఛైర్మన్‌ పదవి ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. గ్రామస్థులకు కాకుండా వేరే వారిని ఛైర్మన్‌గా నియమిస్తే పెద్ద ఎత్తున గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, అంజయ్యగౌడ్‌, చంద్రయ్య, ప్రవీణ్‌రెడ్డి, మన్సూర్‌, అశోక్‌, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చనిపోయిన ముగ్గురికి కూలి చెల్లింపులు

అచ్చంపేట న్యూటౌన్‌ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై పర్యవేక్షణ లోపంతోనే అక్రమాలు చోటు చేసుకున్నాయని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రాజేశ్వరి అన్నారు. 2023 ఏప్రిల్‌ నుంచి 2024 మార్చి 31 వరకు 38 గ్రామ పంచాయతీల్లో రూ.6.04 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. దుబ్బతండాలో చనిపోయిన ముగ్గురు వ్యక్తుల పేర చేసినట్లు కూలీ డబ్బులు చెల్లించారని తనిఖీ బృందం నివేదిక ద్వారా వెల్లడయ్యింది. మరో 8 మంది హైదరాబాద్‌లో ఉన్నారని, పని చేయకుండానే కూలీ చెల్లించినట్లు దస్త్రాల్లో నమోదుపై నిలదీశారు. బొమ్మన్‌పల్లి శివారులోని పోశమ్మ దేవాలయం నుంచి కొత్త చెరువు వరకు రైతులు స్వయంగా రహదారిని ఏర్పాటు చేసుకోగా ఉపాధి హామీ పథకంలో రూ.3.53 లక్షల బిల్లు చేసుకున్నారని ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీలలో గుర్తించిన అక్రమాలు, జరిమానా, వసూలు వివరాలను తనిఖీ పూర్తయిన అనంతరం వెల్లడిస్తామని ఆమె పేర్కొన్నారు.

● డ్రగ్స్‌పై సీడీ ఆవిష్కరణ

కందనూలు, న్యూస్‌టుడే : యువకులు మత్తు పదార్థాలతో ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌ రఘునాథ్‌ అన్నారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జానపద కళాకారులు రూపొందించిన 'డ్రగ్స్‌ మాయలో పడొద్దు కొడుకా' అనే పాట సీడీని ఎస్పీ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామేశ్వర్‌, డీఎస్పీ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

● మొక్కలు నాటిన భాజపా నేతలు

అమ్రాబాద్‌, న్యూస్‌టుడే : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా భాజపా నేతలు మండల కేంద్రంలో శుక్రవారం మొక్కలు నాటారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని సేవా పక్వాడా జిల్లా కో కన్వీనర్‌ మండికారి బాలాజీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీనివాసులు, కిసాన్‌ మోర్చా నాయకులు చంద్రయ్యగౌడ్‌ పాల్గొన్నారు.

● వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

కొల్లాపూర్‌, న్యూస్‌టుడే : సీజనల్‌ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని కొల్లాపూర్‌ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డా.శ్రీనివాస్‌ అన్నారు. శుక్రవారం ఆసుపత్రిలో రోగులను పరీక్షించి మాట్లాడారు. ఎక్కువగా టైఫాయిడ్‌, మలేరియా, విషజ్వరాలతో వస్తున్నారన్నారు. 24 గంటల పాటు వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు.

● విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీతకే పోటీలు

కొల్లాపూర్‌ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాల వెలికితీయడానికి ప్రతిభ పోటీలు నిర్వహించినట్లు స్వేరో జిల్లా అధ్యక్షుడు మోహన్‌ కుమార్‌ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గాంధీ జయంతి సందర్భంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అక్టోబర్‌ 2న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. రమేష్‌, సంపత్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

● సీఐ కార్యాలయంలో ఫిర్యాదు

కందనూలు, న్యూస్‌టుడే : దివ్యాంగులను బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం డిమాండ్‌ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌, కాశన్న, సైదులు, రాజు, శ్రీదేవి, భారతి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుల సమస్య కేంద్రం దృష్టికి తీసుకెళ్తా


కొల్లాపూర్‌లో మామిడిరైతుల సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

కొల్లాపూర్‌ పట్టణం, న్యూస్‌టుడే : మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కారం కోసమే కమిటీ ఏర్పాటు చేసినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు, మామిడి రైతుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌ రావు అన్నారు. శుక్రవారం పట్టణంలో మామిడి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే కొల్లాపూర్‌ నియోజకవర్గం మామిడికి ప్రసిద్ధి చెందినా రైతుల కష్టాలు తీరడం లేదన్నారు. మామిడి రైతులు సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వ్యవసాయ, భూసార పరీక్ష కేంద్రం అధికారులతో కొల్లాపూర్‌లో కార్యశాల నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు సవ్యసాచి, ఎన్నికల అధికారిగా సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌ మామిడి రైతుల సంఘం కమిటీ ఎన్నిక..: కొల్లాపూర్‌ మామిడి రైతుల సహకార సంఘం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా ఎల్లేని సుధాకర్‌రావు, అధ్యక్షుడిగా పెద్దూరి రామస్వామి, డైరెక్టర్లుగా శివకుమార్‌, రామస్వామి, పెంటమ్మ, స్వప్న, పుల్లయ్య, శేఖర్‌, కృష్ణారావు, విష్ణువర్ధన్‌రెడ్డిని ఎనుకున్నారు.

సురక్షిత నీటి సరఫరాకు చర్యలు


పట్టణంలోని 19వ వార్డులో చేతిపంపును పరిశీలిస్తున్న పుర అధ్యక్షురాలు, కౌన్సిలర్లు, అధికారులు

కొల్లాపూర్‌, న్యూస్‌టుడే : పురపాలికలో సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టినట్లు కొల్లాపూర్‌ పుర అధ్యక్షురాలు మేకల రమ్యకుమారి చెప్పారు. శుక్రవారం పలు వార్డుల్లో డీఈ శ్రీనివాసరావు, జేఈ షబీర్‌అహ్మద్‌, పుర ఏఈ హేమలతతో కలిసి పర్యటించారు. చేతిపంపు బోర్లు, ఓవర్‌హెడ్‌ ట్యాంకు ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలించి మాట్లాడారు. ఇంటింటికి తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే గుత్తేదారులపై చర్యలు ఉంటాయన్నారు. ట్యాంకుల పరిధిలో ఉన్న తాగునీటి కనెక్షన్‌ల వివరాలను జిల్లా అధికారులకు నివేదించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీదేవిగౌతంగౌడ్‌, షేక్‌రహీంపాషా, సిబ్బంది, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

పెద్దకొత్తపల్లి: ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలని కల్వకోలు గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం బ్యాంకు వద్ద పొదుపు పథకాలపై కళాజాత నిర్వహించారు. మరణించిన గుణమోని శేషమ్మ కుటుంబానికి రూ.20 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోళ్ల ఏసయ్య, పూర్ణచంద్ర, శివకుమార్‌, సురేష్‌రెడ్డి, వెంకటస్వామి, గోపినాథ్‌ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలి

డీఎఫ్‌వో సత్యనారాయణ


వాలీబాల్‌, కబడ్డీ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎఫ్‌వో సత్యనారాయణ

మహబూబ్‌నగర్‌ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం డీఎస్‌ఏ ఇండోర్‌ స్టేడియంలో ప్రాంతీయ అటవీశాఖ క్రీడాపోటీల ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రమం తప్పకుండా క్రీడల్లో ఉద్యోగులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్‌, కబడ్డీ విజేత అమ్రాబాద్‌..: వాలీబాల్‌లో విజేతగా అమ్రాబాద్‌.. రన్నర్స్‌గా అచ్చంపేట, కబడ్డీలో అమ్రాబాద్‌కు స్వర్ణ పతకం, రజతం దక్కింది.

హెచ్‌ఐవీపై కళాజాత


అచ్చంపేట: ప్రదర్శనతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అమ్రాబాద్‌, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో శుక్రవారం స్వరమాధురి జానపద కళాకారుల బృందం హెచ్‌ఐవీపై ప్రదర్శన ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో హెచ్‌ఐవీ వ్యాప్తి, ముందు జాగ్రత్తలు, నివారణ మార్గాలపై ప్రదర్శన చేశారు. కళాకారులు శ్రీనివాస్‌, చెన్నయ్య, శ్రీనయ్య, రాజు, జాన్సీ, ఎన్‌జీవో భాగ్యమ్మ, సరస్వతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట, న్యూస్‌టుడే : హెచ్‌ఐవీ నివారణపై శుక్రవారం అచ్చంపేట ప్రయాణికుల ప్రాంగణంలో మదర్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ (ఎంఆర్‌డీఎస్‌) ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జీఎన్‌ఎం పద్మ, కళాకారులు అంబిక, రాజు, నిర్మల, చిట్టి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశ మార్పులపై అవగాహన


పోస్టర్‌ మేళా ప్రదర్శనలో విజేత ఈశ్వర్‌చంద్రకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : కౌమార దశలో బాల బాలికల్లో కలిగే శారీరక, మానసిక, ఉద్వేగపరమైన మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సైన్స్‌ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా సైన్స్‌ అధికారి రాజశేఖర్‌రావు తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ సహకారంతో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్‌కర్నూల్‌లో జిల్లా స్థాయి సైన్స్‌ ఉపాధ్యాయులకు కౌమార దశలో పిల్లల్లో కలిగే వివిధ మార్పులపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఈ అంశంపై పోస్టర్‌ మేళా పోటీలు నిర్వహించారు. 83 పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనగా అచ్చంపేటకు చెందిన ఈశ్వర్‌ చంద్ర ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్‌ గాంధీ మోడల్‌ స్కూల్‌ విద్యార్థి రాకీఫ్‌ ద్వితీయ బహుమతులు సాధించారు. వారికి జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్‌ నివారణ అధికారి రవీందర్‌రెడ్డి, విద్యాశాఖ ఏఎంవో షర్ఫుద్దీన్‌, పోటీల న్యాయనిర్ణేత వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రేరణకు ఎంపికైన బిజినేపల్లి విద్యార్థి


జ్ఞానేశ్వర్‌రెడ్డి

బిజినేపల్లి, న్యూస్‌టుడే : బిజినేపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి జ్ఞానేశ్వర్‌ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రేరణ కార్యక్రమానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జోసెఫ్‌ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 20 మంది విద్యార్థులు ఎంపికకాగా, గుజరాత్‌లో విద్యార్థులకు 12 రోజులపాటు కేంద్ర బృందం వివిధ అంశాలపై అవగాహన కల్పించనుందన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం


మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్‌ చెన్నయ్య

అచ్చంపేట టౌన్‌, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్‌ చెన్నయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. భాజపా ప్రభుత్వం దళితులను విభజించి పాలించే కుట్రలో భాగమే వర్గీకరణ అన్నారు. కమిషన్‌ ఏర్పాటు చేసి కుల గణన చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉప కమిటీని వెంటనే రద్దు చేయాలన్నారు. నేతలు వెంకటేశ్వర్లు, రమేష్‌, దివాకర్‌, మల్లికార్జున్‌, ఆంజనేయులు, స్వామి, శ్రీనివాస్‌, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళల రిమాండ్‌

అచ్చంపేట న్యూటౌన్‌, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ నగల దుకాణంలో చోరీకి పాల్పడిన ఘటనలో ముగ్గురు మహిళలను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాము తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈనెల 16న చోరీ జరిగిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు తిమ్మాజిపేట మండలం బాజీపూర్‌తండాకు చెందిన నిందితులను గుర్తించారు. వారి నుంచి కిలోన్నర వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ముడావత్‌ బుజ్జి, లక్ష్మి, అస్లిలను జూనియర్‌ సివిల్‌ కోర్టు జడ్జి విజయ్‌కుమార్‌ ఎదుట హాజరుపర్చగా.. 14 రోజుల రిమాండ్‌ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఇళ్ల కేటాయింపులో నిర్లక్ష్యం వీడాలి


కలెక్టరేట్‌ ముందు ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

నాగర్‌కర్నూల్‌, న్యూస్‌టుడే : రెండు పడకల గదుల ఇళ్లు పేదలకు ఇచ్చేందుకు ప్రభుత్వానికి చేతులు రావడం లేదని ఐద్వా రాష్ట్ర నాయకురాలు గీత విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ముందు కల్వకుర్తి పట్టణంలోని రెండు పడకల గదుల లబ్ధిదారులు ధర్నా చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి గీత మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణంలో 17 నెలల క్రితం డిప్‌ పద్ధతిలో రెండు పడకల ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. 90 శాతం నిర్మాణం పనులు పూర్తి అయ్యాయన్నారు. చిన్న చిన్న పనులు పూర్తి చేసి అప్పజెప్పకపోవడం వల్ల పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రూ. వేలు ఇంటి అద్దెలు కట్టాల్సి వస్తోందన్నారు. పంచాయతీ రాజ్‌ ఈఈతో పూర్తి వివరాలను తెప్పించుకొని పెండింగ్‌ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్‌ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నరసింహ, పద్మ, వెంకటచారి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిళ్లపల్లి లక్ష్మీనరసింహుడి దర్శనంలో న్యాయమూర్తులు

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ స్వామిని శుక్రవారం నాగర్‌కర్నూల్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి జి. సబిత, ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి మౌనిక దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం విశిష్టతను గ్రామస్థులు వారికి వివరించారు. ఆలయ తరపున వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు. వారి వెంట న్యాయవాదులు ఎం.మధుసూదన్‌రావు, శ్యాంప్రసాద్‌రావు, శ్రీనివాస రెడ్డి, బి.రాంచందర్‌, ఈవో నరసింహులు, నాయకులు ఇంద్రసేనారెడ్డి, నర్సింహరావు, మోహన్‌గౌడ్‌, రాజల్‌రావు, బాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాధర్నా జయప్రదం చేయండి

కల్వకుర్తి, న్యూస్‌టుడే : కల్వకుర్తిలో శనివారం ఏర్పాటు చేసిన బీసీ మహా ధర్నాకు రాష్ట్ర బీసీ, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు రానున్నట్లు తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపకులు శ్రీనివాస్‌యాదవ్‌ తెలిపారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే మహాధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య, ఎమ్మెల్సీ తీన్మార్‌ మల్లన్న, మాజీ ఐపీఎస్‌, ఐఏఎస్‌ అధికారులు, మాజీ మంత్రులు తదితరులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. బీసీ గణన చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలంటూ చేపట్టే ధర్నాకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.